## క్లుప్తంగా

### ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందించాలి



గండిమాసానిపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్

ఎల్లారెడ్డిరూరల్ : రైతులకు సంబంధించిన ధాన్యం తడవకుండా ఉండేందుకు వారికి టార్పాలిన్లు అందించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేశ్ అన్నారు. సోమవారం గండిమాసానిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ కార్యదర్శి విశ్వనాథం తదితరులున్నారు.

### సంస్కృతి సంప్రదాయాలు అలవడుతాయి



పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి):చిన్నతనం నుంచి సంస్కృతి సాంప్రదాయాలు పిల్లలకు అలవర్చాలనే ఉద్దేశ్యంతోనే బాల సంస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు లింగంపల్లి శ్రీకృష్ణ మందిరం పీఠాధిపతి మచాలే బాబా అన్నారు. ఈ నెల 5న ప్రారంభమైన బాల సంస్కార శిబిరం ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన చిన్నారుల తల్లిదండ్రులు,చక్రధర్ సేవాసమితి ప్రతినిధులు సారంగ్ బాబా తదితరులున్నారు.

### ప్రాచీన కళలకు జీవం



దేవతల వేషధారణలో కళాకారులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గాలీపూర్ గ్రామంలో మూడు రోజుల నుంచి రేణుకా ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు ఎల్లమ్మ నాటక ప్రదర్శన చేపట్టారు. దేవతల వేషధారణలు, ఆటా, పాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. యువకులు ప్రాచీన కళలకు జీవం పోశారు.

### ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్‌లు మాట్లాడుతూ...భూంపల్లి శివారులో కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాణహిత ప్రాజెక్టు పునర్నిర్మాణం నిర్మాణం కోసం రూ.23 కోట్లు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, మాజీ వైస్ ఎంపీపీలు గాదారి శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాపనొల్ల బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె నోటీసుల అందజేత

బిచ్కుంద(జుక్కల్): ఈనెల 20న ఒకరోజు సమ్మె కార్యక్రమం చేపడుతున్నామని కార్మికులు సోమవారం ఎంపీడీవో గోపాల్‌కు సమ్మె నోటీసుల పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ మాట్లాడుతూ కార్మిక శాఖ, కార్మిక సంఘాలు లేకుండానే కేంద్రం చట్టాలను తీసుకొస్తుందని, వీటితో కార్మికులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి



విశిష్ట సంఖ్యను నమోదు చేస్తున్న ఏఈవో

బీబీపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతులకు 11 సంఖ్యలతో కూడిన యూనిక్ కోడ్ ను నమోదు చేసినట్లు ఏఈవో రాఘవేంద్ర తెలిపారు. 'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో రైతుల వివరాలను నమోదు చేసి వారికి కోడ్ ను ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రైతుకు ఈ కోడ్‌ను ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఐదేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత

- పదిలో సత్తా చాటుతున్న లింగంపేట మైనారిటీ గురుకుల విద్యార్థులు
- జిల్లా స్థాయిలో పలు విభాగాల్లో రాణింపు



పదో తరగతి టాపర్ నిక్షయ్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ (ఫైల్)



జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో బహుమతులు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయుల అంకిత భావం, విద్యా బోధనలో నైపుణ్యంతో ఐదేళ్లుగా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతతో లింగంపేట మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిక్షయ్ నిలిచాడు. అలాగే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న సైన్స్‌ఫేర్, సబ్జెక్టు టాలెంట్ టెస్టులు, చెకుముఖి టాలెంట్ టెస్టుతో పాటు పలు విభాగాల్లో ప్రతిభ కనబరుస్తూ కలెక్టర్, జిల్లా విద్యాధికారి, ప్రజాప్రతినిధులతో అవార్డులు అందుకొని అందరి మన్ననలు పొందారు. లింగంపేట మైనారిటీ గురుకుల పాఠశాలలో నిరంతరం ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయడంతో పాటు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారు.

**పాఠశాల నేపథ్యం ..**

మైనారిటీ గురుకుల పాఠశాలను మండల కేంద్రంలో 2017–18 సంవత్సరంలో 5, 6, 7 తరగతులతో ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఒక్కో తరగతి చొప్పున 2021–22 విద్యా సంవత్సరం వరకు ఇంటర్ వరకు పెంచారు. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థుల చొప్పున 240 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. 20 మంది టీచింగ్ సిబ్బంది, నాన్ టీచింగ్ 15 మంది మొత్తం 35 మందితో పదో తరగతి వరకు కొనసాగుతుంది. 2023 జనవరి 25న జూనియర్ కళాశాల బైఫరికేషన్ అయింది. కళాశాలలో 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యునిఫాం, షూ, సాక్స్, కాస్మోటిక్స్ ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

## సాధించిన విజయాలు

- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో సైన్స్ చెకుముకి సంబరాల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించి ఆదిలాబాద్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవార్డు అందుకున్నారు.
- 2024–25లో భౌతిక, రసాయన శాస్త్ర టాలెంట్ టెస్టులో పి. రాహుల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికై ప్రతిభ చాటాడు. జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో జిల్లా స్థాయికి ఎంపికై ప్రతిభ చాటారు.
- టిమ్రీస్ ఆధ్వర్యంలో 2022–23లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన స్పార్క్ ఫేస్ట్ క్విజ్ పోటీల్లో నిక్షయ్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి అందుకున్నాడు.
- 2024లో సీఎం కప్ టోర్నమెంట్‌లో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చాటి 21 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రశంసలు పొందారు.
- 2021 ఆగస్టు 15న, 2025 జనవరి 26న పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రాములు జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా జిల్లా కలెక్టర్ ఆశిషసంగ్వాన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రశంసించారు.
- 2025 పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 205 మైనారిటీ గురుకుల పాఠశాలలకు గాను పదో తరగతి విద్యార్థి నిక్షయ్ 581/600 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచాడు.
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు రాష్ట్ర మైనారిటీ గురుకులాల సెక్రటరీ షఫీఉల్లా ప్రశంసా పత్రం అందజేశారు.

### నిరంతర పర్యవేక్షణ



నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇస్తూ నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నాం. చదువుతో పాటు క్రీడలు, సహపాఠ్య బోధన చేస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం. ఐదేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత సాధించాం. ఇందుకు ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉంది.

– వెంకట్రాములు, ప్రిన్సిపాల్

## కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి



కుట్టు మిషన్లను అందజేస్తున్న తహసీల్దార్

నిజాంసాగర్(జుక్కల్): మహిళలకు కుట్టుశిక్షణ ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తున్నామని గ్రామ స్వరాజ్యం జిల్లా కోఆర్డినేటర్ రంగ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మహమ్మద్ నగర్‌లో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నెలరోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు. తహసీల్దార్ సవాయిసింగ్, ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్, కుట్టు శిక్షకురాలు నవ్య, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌సింగ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు నిషాద్ కౌసర్, మహిళలు పాల్గొన్నారు.

**మాచారెడ్డి మండల కేంద్రంలో**

మాచారెడ్డి : మండల కేంద్రంలో సోమవారం గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో 35 మంది మహిళలను ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. నెలరోజుల పాటు కుట్టు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతోపాటు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రంగ వెంకటలక్ష్మి, మండల కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ఏపీవో సాయిబాబు, పంచాయతీ కార్యదర్శి ఆస్మా బేగం ఉన్నారు.

## స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

కామారెడ్డి టౌన్: విద్యార్థుల స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బకాయిల కారణంగా ప్రైవేట్ కళాశాలలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేకపోయాయన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలను ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించలేమని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు ఉన్నత చదువులైన పీజీ, బీఈడీ నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేయాలని, కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు సకాలంలో జరపాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, రాము, ప్రభంజన్, రవి, రాజేందర్, కిరణ్, ప్రకాష్, తదితరులున్నారు.

## వీరజవాన్లకు ఘన నివాళి



ఎల్లారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న యువకులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని పోచమ్మ ఆలయంలో ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు స్థానికులు నివాళులు అర్పించారు. జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు వందనాలు సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ వాసులు మహేష్, సతీష్, అమృత్, నవీన్, సిద్ధు, పృథ్వీ, తులసి తదితరులున్నారు.

**బాన్సువాడ మండలంలో..**

బాన్సువాడ రూరల్: మండలంలోని రాంపూర్ తండా, కృష్ణానగర్‌తండాల్లో ఆదివారం రాత్రి దేశం కోసం అమరులైన వీరజవాన్ల మృతికి సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. పాకిస్తాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన వీరజవాన్లు మురళినాయక్, సచిన్ యాదవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. తండా నాయకులు, యువకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

### గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్చొద్దు

కామారెడ్డి రూరల్: అనుమతి లేని బడుల్లో పిల్లలను చేర్పించవద్దని కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య సూచించారు. ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కామారెడ్డి పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపు లేకున్నా విద్యార్థులను స్కూల్లో చేర్పించుకుంటున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే ముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉందా లేదా అనే సమాచారం తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. పట్టణంలోని నారాయణ పాఠశాలకు, అలాగే వివేకానంద బీ టాపర్ ప్రైమరీ స్కూల్ రెండో బ్రాంచ్ కి కూడా ఇప్పటివరకు ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.

**అనుమతి లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని వినతి**

బాన్సువాడ : తప్పుడు పత్రాలతో గుర్తింపు పొందిన పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ జీవన్ అన్నారు. సోమవారం ఆయన బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ మండలం బుడ్మి చౌరస్తా వద్ద ఐటీఐ కళాశాల భవనంలోనే ఓ పాఠశాలకు అనుమతి తీసుకోవడం శోచనీయమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు. ఎల్ఎస్‌వో నాయకులు వికాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి పలువురి గైర్హాజరు



ప్రజావాణికి హాజరైన అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నలుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజావాణిలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో నరేందర్ మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడం విశేషం.

## రోడ్డు కబ్జాను అడ్డుకున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



పాతిన బోర్డు, రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు రామారెడ్డి రోడ్డులో గల సుభాష్ థియేటర్ ఎదురుగా మాస్టర్ ప్లాన్ 40 ఫీట్ల రోడ్డును ఓ వ్యక్తి కబ్జాకు యత్నించాడు. ఈనెల 10వ తేదీన '40ఫీట్ల రోడ్డు కబ్జాకు యత్నం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం రోడ్డుకు అడ్డంగా పెట్టిన బోర్డును, పాతిన హద్దురాళ్లను తొలగించారు. సదరు వ్యక్తికి హెచ్చరిస్తూ నోటీసు జారీ చేశారు. మరోసారి కబ్జాకు యత్నిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని టీపీవో గిరిధర్ హెచ్చరించారు.

## పెద్దమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ముదిరాజ్ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ ఆలయం ప్రారంభోత్సవానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను సోమవారం ముదిరాజ్ నాయకులు అందజేశారు. ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే పెద్దమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠపనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ. 40 లక్షలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయం నిర్మాణం చేపట్టారు. ఆలయ ప్రారంభోత్సవానికి శాసన సభ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, శంకర్, నీలం మధు, ముదిరాజ్ తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శి నిజ్జని రమేశ్‌తో పాటు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బట్టు విఠల్, మండల అధ్యక్షుడు దాసరి సాయికుమార్, ఈర్ల శ్రీనివాస్, చంద్రబాబు, కొడబోయిన సాయికుమార్, బాలయ్య, శ్రీనివాస్, ఈర్ల బాలయ్య, శ్రీను, సాయిలు, తదితరులున్నారు.

### ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



తాడ్వాయిలో బుద్ధుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

తాడ్వాయి/బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలో సోమవారం అంబేడ్కర్ యూత్ సంఘం ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రంజిత్, రాజయ్య, స్వామి, రాంచంద్రం, సుధాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

**కాద్లాపూర్‌లో బుద్ధపౌర్ణిమ వేడుకలు**

బాన్సువాడ మండలంలోని కాద్లాపూర్ గ్రామంలో బుద్ధపౌర్ణిమ వేడుకలను బౌద్ధ భిక్షులు ఘనంగా జరుపుకున్నారు. పల్లె ప్రకృతివనంలోని గౌతమ బుద్ధుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించారు.

## ఆధ్యాత్మికం

### సామూహిక నవదుర్గ, సత్యనారాయణ వ్రతాలు



సామూహిక దుర్గ వ్రతంలో పాల్గొన్న మహిళలు

కామారెడ్డి అర్బన్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీశారదామాత అమ్మవారి ఆలయంలో సామూహిక శ్రీనవదుర్గ వ్రతం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు సతీష్‌పాండే, అజయ్ పాండేలు వ్రతం నిర్వహించగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దేవునిపల్లిలో.....**

పౌర్ణమి సందర్భంగా దేవునిపల్లి శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**మద్నూర్‌లో రథోత్సవం ప్రారంభం**



మద్నూర్‌లో ఊరేగింపు కోసం ముస్తాబైన రథం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథ్‌గల్లీలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు భక్తుల కోసం అన్నదాతగా వ్యవహరించినట్లు నిర్వహకులు తెలిపారు. పాత బస్టాండ్‌లోని హనుమాన్ ఆలయం వరకు అర్ధరాత్రి రథం ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి వైశాఖ శుక్ల పౌర్ణమి రోజున రథోత్సవం, రథం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు తదితరులున్నారు.

**నేడు కుస్తీ పోటీలు**

రథోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గోశాలలో మంగళవారం ఉదయం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ తెలిపింది.

**వైభవంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు**



దేవతామూర్తులకు జలాభిషేకం చేస్తున్న అర్చకులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గున్కుల్ గ్రామంలో సోమవారం రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, దేవతామూర్తుల విగ్రహాలకు జలధివాసం కార్యక్రమాలు జరిపారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. రాత్రి వేళ గ్రామ దేవతలకు బోనాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు కొర మండల్ సాయాగౌడ్, భానుగౌడ్, సతీష్‌గౌడ్, మొగులాగౌడ్, సాయాగౌడ్, గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, పాండుగౌడ్, స్వామిగౌడ్ తదితరులున్నారు.

**రైల్వే స్టేషన్‌లో అన్నదానం**

కామారెడ్డి అర్బన్: శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్ ఆలయం ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం దివ్యపాదుకాభిషేకం, అర్చన, వంశాభివృద్ధి విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద దాదాపు 500 మందికి అన్నదానం చేశారు. ఆలయ ప్రతినిధులు ఎర్రం చంద్రశేఖర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఎల్లమ్మ వార్షికోత్సవం**

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నర్వ గ్రామంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, రాత్రి వేళ బోనాల ప్రదర్శన నిర్వహిస్తున్నామని గౌడ సంఘం నాయకులు తెలిపారు.

**14 నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం**



శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఏడో వార్షికోత్సవాన్ని ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, ఆలయ అర్చకుడు రవికాంత్‌లు తెలిపారు. 15న స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పల్లకీ సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## సంక్షిప్తం

**18న జిల్లా మున్నూరు కాపు సంఘం సమావేశం**

కామారెడ్డి అర్బన్: ఈనెల 18న ఆదివారం వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మున్నూరుకాపు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సమన్వయకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్టు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు, పెట్టిగాడి అంజయ్యలు తెలిపారు. సమావేశానికి సకాలంలో సభ్యులు హాజరు కావాలని కోరారు.

**ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం**

మున్నూరుకాపు కులానికి చెందిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయడానికి పేర్లు నమోదు చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు, పెట్టిగాడి అంజయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో 450, ఇంటర్‌లో 900 మార్కులకు పైగా సాధించిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ**

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బస్వాయిపల్లి గ్రామంలో గల ఉపాధి కూలీలకు ఆరోగ్య శాఖ సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది వరలక్ష్మి ,గ్రామస్తులు పాల్గొన్నారు.

**వడదెబ్బకు గురై ఉపాధి కూలీకి అస్వస్థత**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాకు చెందిన గుగులోత్ మోతిలాల్ సోమవారం వడదెబ్బకు గురై అస్వస్థతకు గురైనట్లు తోటి కూలీలు తెలిపారు. మోతిలాల్ రోజువారీగా ఉపాధి పనులకు వెళ్లాడు. తండా శివారులోని రఘుపతి కుంటలో ఉపాధి పనులు చేస్తున్న సమయంలో వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించారు.

**డీఎస్పీని కలిసిన ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు**

బాన్సువాడ : బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డిని సోమవారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు కలిసి సన్మానించారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను డీఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ పౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, జిల్లా అధ్యక్షులు బంగారు రవి, డివిజన్ నాయకులు రాజారాం, గోపాల్ తదితరులు ఉన్నారు. అంతకుముందు సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు ఉప్పరి లింగం ఆధ్వర్యంలో డీఎస్పీని కలిసి సన్మానించారు.

**ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తాచాటిన యాసిన్**



పిట్లం(జుక్కల్): ఎప్‌సెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన యువకుడు సత్తాచాటాడు. రాష్ట్ర స్థాయిలో 652 ర్యాంక్ సాధించాడు. అతడిని తల్లిదండ్రులు, బంధుమిత్రులు, గ్రామస్తులు యాసిన్‌ను అభినందించి శుభకాంక్షలు తెలిపారు.

**శిక్షణకు బయలుదేరిన తెలుగు ఉపాధ్యాయులు**

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ వెంకన్న గారి జ్యోతి, జంగం శ్రీశైలం, కదారి రవికుమార్, తిదిరి శ్రీనివాస్, డాక్టర్ రూప్ సింగ్, దిగంబర్‌లు హైదరాబాద్‌లోని హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ జరిగే ఐదురోజుల వృత్తి శిక్షణకు వెళ్లినట్లు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వేణుశర్మ తెలిపారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపర్చడం కోసం శిక్షణ తీసుకొని తిరిగి జిల్లా స్థాయిలో వారు శిక్షణ ఇస్తారన్నారు.